ఈవారం కథ

# పరువు

సోదుం జయరాం



రకరకాల మనుషులు న్నప్పుడు, ఆ మనుషులకు సంబంధించిన పరువులూ రకరకాలుగా వుండక తప్పవు. రంగారెడ్డిదొకరకం పరువైతే, కిట్టయ్యదింకోరకం పరువు. ఎవరి పరువును వారు కాపాడుకోవాలని చూడ్డమూ సహజమే.

అయితే, తను పరువు అనుకునేది నిజానికి తనదేనా, పరాయిదా అనేది కిట్టయ్యలాంటి వాళ్ళకు తెలుసా? అన్నది బరువైన ప్రశ్న.

వాచీలో టైం చూశాను. ఎనిమిదిన్నర అయింది.

పిండారబోసినట్లు వెన్నెల కాస్తున్నది. ఉండి వుండి చల్లటి గాలి వీస్తున్నది. చాలా ఆహ్లాదకరంగా వుంది. తెల్లవార్లూ అలాగే టేబుల్ ముందు కూర్చోవాలనిపిస్తోంది. అప్పటికి రెండు రౌండ్లు పూర్తిచేశాను. మూడో రౌండుకు వద్దామనుకుంటున్నాను.

"మీరిప్పడే లేవరా?" పార్వతి తీవ్రమైన కంఠస్వరం వినిపించింది. ప్రశాంతమైన కొలనులో రాయి విసిరినట్లుగా నా మానసిక శాంతి భగ్నమైపోయింది. నా ఆనందాన్ని, ఆహ్లాదాన్ని చూసి పార్వతి అసూయపడుతున్నదేమో! అవును. ఆ కంఠస్వరం నాకు అలాగే అనిపించింది. నేనేం సమాధానం చెప్పలేదు. మూడో రౌండుకి గ్లాసులోకి విస్కీ నింపుకున్నాను.

"మిమ్మల్నే? పలకరేం?" అంది పార్వతి రెట్టించిన కోపంతో.

"ఏం కొంపలంటుకపోతున్నాయని అట్లా రంకెలు వేస్తున్నావ్?" అన్నాను ప్రశాంతంగా.

"మీ కోసం మన పనిమనిషి లక్ష్మి వచ్చింది. ఇట్లా లేచిరండి. మీతో మాట్లాడాలి" అంది.

నాకు చాలా చికాకు వేసింది. నందనవనంలో విహరిస్తున్నవాణ్ని కాళ్లు పట్టి భూమి మీదికి లాగడానికి ప్రయత్నిస్తున్నారు. ఉదయం నుంచి ఉవ్విళ్లూరి, తీరా ఇప్పడనుభవిస్తుండగా ఆ ఆనందాన్ని భగ్నం చేస్తున్నారు. అవును. ఉదయం నుంచి కలలుగన్నాను. నేను ఉదయం పేపరు చూసుకుంటున్నాను. సెక్యూరిటీ గార్డు లక్ష్మణ్ వచ్చాడు. పేపరు నుంచి దృష్టి మరల్చి కళ్ళతోనే పలకరించాను. "ఇవ్వాళే నా కోటా తెచ్చాను. ఈగల్లా ముసురుకొని బాటిల్స్ అన్నీ పట్టుకపోయారు. మీ కోసమని ఒక బాటిల్ అట్టేపెట్టి తెచ్చాను. తీసుకుంటారా?" అన్నాడు. నా ప్రాణం లేచి వచ్చింది. అతను అడిగినంతా డబ్బిచ్చి తీసుకొన్నాను. చీకటి పడటమన్నది యుగాలు గడిచినట్టు అయిపోయింది. పానకంలో పుడకలాగా లక్ష్మి ఎందుకు వచ్చిందో నాకు అర్థంకాలేదు.

"వాకిట్లో నిలబడి అట్లా రుసరుసలాడకపోతే దగ్గరికి వచ్చి విషయం చెప్పకూడదూ" అన్నాను విసుగ్గా. పార్వతి సాధారణంగా నా తపోవనంలో ప్రవేశించదు. తప్పదనుకున్నట్లు వుంది. దగ్గరికి వచ్చింది.

"ఏమిటి సంగతి?" అన్నాను.

"లక్ష్మి మొగుణ్ని పోలీస్ స్టేషన్‌లో పెట్టారు. మీరు తొందరగా వెళ్ళి విడిపించుకరావాలి" అంది పార్వతి.

"ఏం కేసు"

"ఇంకేం కేసులున్నాయి. ముదనష్టపు కేసులు. మీ కేసే" అంది కోపంగా పార్వతి.

"తాగాడా?" అన్నాను తాపీగా.

"మీకు చిలక్కు చెప్పినట్టు చప్పాలి. మీ కేసే అంటున్నా

మగా" అంది ధుమధుమలాడుతూ.

పార్వతితో సంభాషణ పొడిగిస్తే కిక్కు దిగిపోయేట్టు వుంది. బాటిల్ తీసి గ్లాసులోకి వంచుకుంటున్నాను. పార్వతి పీసా గట్టిగా పట్టుకుంది.

"వదులు పార్వతీ. ఈ రౌండు పూర్తిచేసి వెళ్తాను" అన్నాను.

"మీరిక్కడ రౌండు పూర్తిచేస్తూ కూచుంటే వాణ్ణి అక్కడ గుల్లగుల్లగా కొట్టి చంపుతారు. మీరేం మనుషులండీ" అంది.

లక్ష్మి పనిమనిషేగాని మా పార్వతికి ఆత్మీయురాలు. ఆమె అంటే పార్వతికి అపారమైన అభిమానం. ఆమెకు ఏ కష్టమొచ్చినా తనకొచ్చినట్టుగానే భావిస్తుంది. ఇక నేను వెళ్లక తప్పదు. లేవబోయి తూలి మళ్ళీ కుర్చీ మీద కూలబడ్డాను. ఈ టైమ్‌లో ట్రాఫిక్ చాలా రద్దీగా వుంటుంది. పోలీసు స్టేషన్‌కు వెళ్లడమంటే ఎంతలేదన్నా రెండు కిలోమీటర్లు నడవాలి. నడిచివెళ్లే స్థితిలో నేను వున్నట్టు లేను.

"పార్వతీ!రమేష్‌కు ఫోన్ చేసి జీపు పంపమని చెప్ప వెళ్తాను" అన్నాను. పార్వతి లోపలికి వెళ్లిపోయింది. గ్లాసులో వంచుకున్న విస్కీ గల్ప్ కొట్టి కళ్ళు మూసుకున్నాను. నేను ఏ రోజూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేదు. ఇప్పుడున్న ఎస్.ఐ. సిప్పియర్, ఆనెస్టూ అని విన్నాను. వచ్చిన చిక్కేమిటంటే అతనితో నాకు ఏ మాత్రం వ్యక్తిగత పరిచయం లేదు. కాకపోతే నేను అతనికి తెలిసివుంటాననే నమ్మకం నాకుంది. ఈ మధ్య జరిగిన ఒక సభలో ఎస్.పి.గారూ, నేనూ పాల్గొన్నాం. నేను ప్రధాన వక్తను. ఎస్.ఐ. ఆ సందర్భంగా చూసే వుంటాడు. ఆ నమ్మకంతోనే అక్కడికి వెళ్లాలనుకున్నాను.

నేను వూహించినట్టుగానే ఎస్.ఐ. నన్ను గుర్తించాడు. కాకపోతే ఇప్పుడు ఆయన ఎవరో వి.ఐ.పి.తో మాట్లాడుతున్నాడు. చాలా ముఖ్యమైన సంగతులేవో మాట్లాడుతున్నట్లుంది.

"హల్లో సార్! పని మీద వచ్చారా?" అన్నాడు ఎస్.ఐ.

"అవును" అన్నాను.

"ఒక్క పది నిమిషాలు ఆగి రండి. తీరిగ్గా మాట్లాడుకోవచ్చు" అన్నాడు.

పది నిముషాలంటున్నాడు. బయటికి వెళ్లడం కంటే సెల్‌లో వున్న కిట్టయ్యను పరామర్శించడం మంచిదనిపించింది. కస్టడీలో వున్న మనిషి. మెంటల్ అగొనీకి లోనయి వుంటాడు. పలకరిస్తే కాస్త వూరటగా వుంటుందనిపించింది.

"సెల్‌లో మా మనిషి వున్నాడు. మాట్లాడనా?" అన్నాను.

"మీకు అభ్యంతరమేమిటి?" అన్నాడు ఎస్.ఐ.

సెల్‌లో బిక్కు బిక్కుమంటూ ఒక్కడే లేడు. కిట్టయ్యలాంటివాళ్ళు చాలామంది వున్నారు. నన్ను చూడగానే కిట్టయ్య ఏనుగువెక్కినంత సంతోషపడ్డాడు. బహుశా వాని కోసం ఎవరన్నా వస్తారని వూహించి వుండడు. కూర్చుని వున్నవాడల్లా గబుక్కున లేచి నిలబడి నమస్కారం పెట్టాడు. షర్టూ, పంచా ఏవీ వంటి మీద లేవు. డ్రాయరుతో వున్నాడు.

"ఏమిటీ అవతారం?" అన్నాను.

"పోలీసులు వూడదీశారు" అన్నాడు సిగ్గుపడుతూ.

"కొట్టారా?" అన్నాను. వాని ముఖం చూస్తే కొట్టి వుంటారనిపించింది. చాలా డీలాపడిపోయినట్లుగా వున్నాడు.

నా వూహ కరెక్టే. వాడు నా ప్రశ్నకు సమాధానంగా వీపు చూపించాడు. వీపంతా కుదుములు తేలి వుంది. నాకు బాధ, కోపమూ రెండూ పెనవేసుకొని వచ్చాయి.

"ఎందుకు కొట్టారు?" అడిగాను.

"సారా అమ్మేదెవరో చెప్పమని కొట్టారు."

"తన్నులు తినడమెందుకు? చెప్పకపోయావా?"

"చెప్పితే వాళ్ళు కీళ్ళు కీళ్ళు విరుస్తారు" అన్నాడు కిట్టయ్య.

తప్పేవాడిదే రాజ్యం అన్నది జీవిత సత్యం అయిపోయింది!

"తాగిన వాడివి తాగినట్టు మర్యాదగా ఇంట్లో పడుకోక వీధినపడి అల్లరెందుకు చేశావ్?"

"రామ! రామ! నేను బయటకూ వెళ్లలేదు. అల్లరీ చెయ్యలేదు. వాళ్లే ఇంటికొచ్చి ఈడ్చుకొచ్చారు."

"పోన్లే. తాగకపోతేనేం? బుద్ధిలేకపోతే సరి" అన్నాను. వాడేం సమాధానం చెప్పలేదు. తలొంచుకొని నిల్చున్నాడు సిగ్గుగా.

కిట్టయ్యను అలా ఎందుకు దండించానా అనిపించింది. నీతులు చెప్పడం, దండించడం హోదా చేస్తుంది. నా హోదా నా చేత అట్లా మాటలు అనిపిస్తున్నదేమో! కిట్టయ్యతో మాట్లాడటానికి ఇంకేం మిగల్లేదు. బయటకు వస్తున్నాను.

"ఎస్.ఐ.గారితో మాట్లాడారా?" అడిగాడు కిట్టయ్య.


"లేదు. ఇంకా మాట్లాడలేదు. ఇంకా పది నిమిషాల తర్వాత కలవమన్నాడు"

"అది పది నిమిషాల్లో తెగే పంచాయతీ కాదులెండి. ఇంకో గంట పట్టవచ్చు" అన్నాడు కిట్టయ్య.

"ఏమిటా పంచాయతీ" అన్నాను విరాసక్తంగా.

కిట్టయ్య గొంతు తగ్గించి గుసగుసలాడుతున్నట్లు అన్నాడు, ఎం.ఎల్.ఎ. గారి మనిషి రంగారెడ్డి అని జీపులో వెళ్తుంటే చెక్ చేశారు. బాంబులూ, రివాల్వరూ దొరికాయి. రంగారెడ్డిగారిని బయటికిపీసి మరొక మనిషి మీద కేసు నమోదు చేయించాలని ప్రయాసపడుతున్నాడు. అదుగో ఆయనే రంగారెడ్డి" అంటూ వేలితో చూపించాడు.

నేను అటువైపు చూశాను. బెత్తెడంచు ఖద్దరు పంచా, ఖద్దరు జుబ్బాతో భారీ విగ్రహం. చాలా హుందాగా కనిపిస్తున్నాడు. కిటికీ దగ్గరచెయిర్‌లో కూచొని పెద్ద సైజు సిగరెట్టు



## అబలలు

ఆడదాన్ని అన్ని అడ్వర్‌టైజ్‌మెంట్లకి వాడుకోవడం మోడర్న్ ప్రపంచానికి మామూలైపోయింది. ఇప్పుడు 'టై' లోపలి భాగంలో నగ్నంగానూ, అర్ధనగ్నంగానూ వుండే మోడల్స్ బొమ్మలు అంటించి వుంటున్నాయి. ఇంక ఈ ఇటాలియన్ ఫ్యాషన్‌ని ఇతర దేశీయులు కాపీ చెయ్యడమే తరువాయి!

## తేనెలో జీవశక్తి

తేనె ఆయుష్షును పెంచుతుందని మన వైద్య శాస్త్ర గ్రంథాలు చెపుతున్న కొన్ని వేల సంవత్సరముల మాట. తేనె పరిశ్రమలో పని చేస్తూ తేనెనే ప్రధాన ఆహారంగా తీసుకునేవారు రష్యాలో వంద సంవత్సరాలకు మించి హాయిగా జీవించడం చూసి వారిపై పరిశోధనలు చేసి పరిశీలనలు కావించి "తేనెకు ఆయుష్షను పెంచే గుణం వుంది" అంటూ తేల్చేశారు.

## ప్లాస్టిక్ ఇంజక్షన్ సూదులు

ఇంజక్షన్ సిరంజీలు ప్లాస్టిక్ మన దేశంలో వాడుకలో వున్నప్పటికీ సూదులు మాత్రం మెటల్‌వే ఉపయోగిస్తున్నారు. ఇజ్రాయిల్‌కు చెందిన విజ్ఞానులు ఇంజక్షన్‌కు నీడిల్‌గా ఉపయోగించేందుకు ప్లాస్టిక్ నీడిల్‌ను కనుగొన్నారు.

సేకరణ : భూక్యా

## కుక్ మ్యాచెస్

ఇంగ్లాండుకు చెందిన "కుక్స్" అన్న కంపెనీవారు నీరు, తేమ, జిడ్డు, ఎటువంటి తడి తగిలినా చెక్కుచెదరకుండా గీయగానే వెలిగే ప్రత్యేకమైన అగ్గి పెట్టెల్ని తయారుచేసి మార్కెట్ చేశారు. ప్రతి అగ్గిపెట్టెతోపాటు ఏదో ఒక వంటకం గురించిన వివరాలు కూడా ఇవ్వడంతో ఈ అగ్గిపెట్టెలు ఆడవార్ని బాగా ఆకర్షిస్తాయి.

– భూక్యా

1. ప్రతిరోజు కొత్తిమీర కూరల్లో వాడినా లేక కొత్తిమీర రసం ఉదయం ఒక చెంచా తీసుకున్నా ఐరన్ లోపాల వల్ల వచ్చే వ్యాధులు మీ దగ్గరకి రావు.
2. నోటి పూతగా వున్నా, నోరు వాసనగా వున్నా ధనియాలు బాగా నమలండి.
3. కొత్తిమీర రసం తీసి కొద్దిగా పసుపు వేసి ప్రతి రోజు ఉదయాన్నే ముఖానికి పట్టించుకుని మీ పని అంతా అయ్యాక స్నానం చెయ్యండి. ఎంతో మృదువుగా వుంటుంది.

– పి. పద్మిని

## నాజూకు

"అమ్మాయి నచ్చలేదన్న విషయం పెళ్లికొడుకు ఎంత నాజూకుగా చెప్పాడో తెలుసా?"

"ఎలా?"

"సరే... అయితే టిఫినికి బిల్ వేయండి అని"

– పి.వి. రమణకుమార్

తాగుతున్నాడు. ఆయన వాలకం చూస్తే పోలీస్ స్టేషన్‌లో వున్నట్టు లేదు. గెస్ట్‌హౌస్‌లో వున్నట్టుగా వుంది.

"అతన్ని సెల్‌లో పెట్టరెందుకని?" అన్నాను.

నా ప్రశ్న కిట్టయ్యకు సమంజసంగా కనిపించలేదు. నొచ్చుకున్నట్లు అన్నాడు, "రాళ్లు తినే పక్షి రాళ్లు తినాలి. రత్నాలు తినే పక్షి రత్నాలు తినాలి. అంతేగదండీ."

అట్లా అంటే నేను కూడా సంతోషిస్తానని కిట్టయ్య ఆ మాట అన్నాడో ఏమో లేక బొద్దు దగ్గర మంచే ఆ మాట వచ్చిందో నాకైతే బోధపడలేదు.

"అది సరే, మరొక మనిషి మీద కేసు నమోదు చెయ్యడమేమిటి?"

"పరువులుగల మనుషులు గదా. జైలుకెళ్తే నామోషీ కదా!"

కిట్టయ్యతో ఇక నేనేం మాట్లాడలేదు. పరామర్శించే పని అయిపోయింది. పోలీస్ స్టేషన్ నుంచి బయటికి వచ్చి నిలబడ్డాను. చంద్రునికేసీ, చుక్కల కేసీ చూస్తూ నిలబడ్డాను. బంగారం లాంటి సమయాన్ని పార్వతి పాడుచేసింది. కొంత సివిలైజేషన్ అంటూ ఒకటి వున్న తర్వాత ఇట్లాంటివి తప్పవేమో!

పంచాయతీ తెగడానికి చాలాసేపే పట్టింది. రతనాలు తినే పక్షి ఎట్టకేలకు కస్టడీలోంచి రివ్వున ఎగిరిపోయింది. మరో రాళ్లు తినే పక్షి దాని స్థానంలో కూచుంది. నేను సంతోషంగా వూపిరి పీల్చుకున్నాను. గబగబా ఎస్సై దగ్గరికి వెళ్లి కూచున్నాను.

"ఎక్స్‌ట్రీమ్లీ సారీ రెడ్డిగారూ. మిమ్మల్ని చాలాసేపు ఆపవలసి వచ్చింది" అన్నాడు.

"అబ్బే పరవాలేదండీ" అన్నాను.

"ఇక చెప్పండి" అన్నాడు ఎస్.ఐ. సిగరెట్ వెలిగించి. మళ్లీ ఏదో జ్ఞాపకం వచ్చినట్లు హెడ్‌కానిస్టేబుల్‌ని కేకేసి అతనికి ఏదో పని పురమాయించడం మొదలుపెట్టాడు. అర్జంటు పనేం కాదు. కనీసం నన్ను ఎదురుగ్గా వుంచుకొని మాట్లాడవలసినంత అర్జంటు పని కాదు. సభ్యత, సంస్కారం లేని మనుషులు!

పోలీసు స్టేషన్‌లో కూచొని సభ్యతా సంస్కారాల గురించి ఆలోచించటం నాదే పొరపాటనిపించింది. హెడ్‌కానిస్టేబుల్‌ని పంపి నా వైపు చూసి,

"చెప్పండి" అన్నాడు మళ్లీ.

కిట్టయ్య విషయం చెప్పి, "వాడు నాకు బాగా కావలసినవాడండీ. దయచేసి వాణ్ణి వదలండి" అన్నాను.

ఎస్సై కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ పకపక నవ్వి,

"చాలా మంచి కేసు కోసమే వచ్చారే" అన్నాడు – పరోక్షంగా అతను నన్ను కించపరుస్తున్నాడనిపించింది. అతని ధోరణి నాకు నచ్చలేదు.

"మంచి కేసులంటే బాంబులూ, రివాల్వర్ల కేసులా?" అన్నాను నవ్వుతూ. అనాలనే అట్లా అన్నాను. ఎస్.ఐ.ని బ్లాక్‌మెయిల్ చెయ్యాలన్న వుద్దేశంతో అన్నాను.

ఎస్సై ముఖం పండు జిల్లేడాకులా పేల్‌గా అయింది.

ఒక క్షణంలో తేరుకొని నా ముఖంలోకి సూటిగా చూసి, "ఏమిటి? డల్‌గా వున్నారు?" అన్నాడు.

'మీరిప్పుడు ఏ స్థితిలో వున్నారో నాకు తెలుసు' అని చెప్పదానికనుకుంటాను ఆ మాటన్నది. నేను తడబడ్డాను.

"అబ్బే అదేం లేదండీ" అన్నాను నట్లుకొడుతూ.

కాసేపు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం తాండవించింది. ఇద్దరమూ గిల్టీగా ఫీలవుతున్నామేమో. చివరకు ఎస్.ఐ. ఏమాలోచించుకొన్నాడో ఏమో దారికి వచ్చాడు.

"ఆ పనికిమాలిన వెధవ కోసం మీలాంటివాళ్ళు ఎవరన్నా వస్తారనుకుని వుంటే కేసు బుక్ చేయకపోయి వుందును. కేసు బుక్ చెయ్యడం అయిపోయింది. తీరా మీరు ఇప్పుడు వచ్చారు. ఒక పని చెయ్యండి. సెల్ నుంచి అతన్ని తీసుకెళ్ళండి. ప్రొద్దున్నే కోర్టులో హాజరు పర్చండి. ఏ రెండు వందలో జరీమానా వేస్తాడు. కట్టగలడుగదా?" అన్నాడు.

వట్టి చేతుల్తో వెళ్ళకుండా ఏదో ఒక మేరకు నా పరువు దక్కింది. సంతోషించాను.

"కడతాడులెండి. అతన్ని బయటికి తీయండి" అన్నాను.

కానిస్టేబుల్ కిట్టయ్యను సెల్ నుంచి బయటికి మా దగ్గర నిలబెట్టాడు.

"ఈయన ముఖం చూసి నిన్ను వదుల్తున్నాను. రేపు కోర్టుకు వచ్చి ఫైన్ కట్టు. ఇంకోసారి తాగవు కదా?" అన్నాడు.

"తాగనండీ" అంటూ కిట్టయ్య దండం పెట్టాడు.

"వెళ్ళు" అన్నాడు గద్దించినట్టు.

"ఇద్దరం బయటికి వచ్చి జీపులో కూచున్నాం. జీపు కదిలింది. "కేసు బుక్కు చెయ్యకుండా చెయ్యలేకపోయ్యాను కిట్టయ్యా" అన్నాను.

"ఎంత మాట! సెల్ నుంచీ బయటకు తీయించారంటే అదే పది వేలు. నా పరువు దక్కింది."

పరువులు పలు రకాలు మరి!

◆



## ఫైబర్

ఈ రోజుల్లో 'ఫైబర్'వల్ల ఎన్నో ఉపయోగాలు వున్నాయి. ఉపయోగించని ప్రదేశం అంటూ లేదు.

ఫైబర్‌ని ఆహారంగా తీసుకుంటే, అది ఎన్నటికీ జీర్ణంకాదు.

ఫైబర్‌ని పండ్లల్లో, కాయగూరల్లో, బంగాళాదుంపల్లో కమలాఫలాల్లో, బత్తాయిల్లో అన్నివిధాలైన పప్పుధాన్యాలలో మనం చూడవచ్చు.

అది ఆహారంతోపాటు కలసి మన జీర్ణక్రియలో ఇతర ఆహార పదార్థాలను మోస్తూ వుంటుంది. ఇలా దానివల్ల కలిగే కొన్ని ఉపయోగాలు అమోఘం.

- మల బద్ధకాన్ని నివారిస్తుంది.
- మన శరీరంలోని హెమరోహైడ్స్‌ను ఈ ఫైబర్ రక్షిస్తుంది.
- శరీరంలోని కొలస్ట్రాల్‌ను తగ్గించి, తద్వారా గుండె జబ్బులను కొంతవరకు అదుపు చేస్తుంది.
- లో క్యాలరీస్ ఆహారం అవడం వల్ల స్థూలకాయాన్ని తగ్గిస్తుంది.
- ఫైబర్ కొన్ని రకాల క్యాన్సర్‌ని నివారిస్తుంది.
- చక్కెర వ్యాధి గ్రస్తులకు ఈ ఫైబర్ ఎంతో ఉపయోగం.

ఇలా ఈ ఫైబర్స్ ఆహారంలో తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు.

7-7-95 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక